సాక్షి నిజామాబాద్
గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



బాలలతో పని చేయిస్తే కేసులే..
18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.
- 8లో ▸



50 వేలకు పైగా కోళ్లు మృతి..
జిల్లాలో బాయిలర్ కోళ్లకు అంతు చిక్కని వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. వారం రోజుల్లో 50 వేలకు పైగా కోళ్లు మృతి చెందాయి.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /16.3

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు మిలిటరీ ట్రైనీ అధికారుల రాక

నిజామాబాద్ సిటీ: మిలిటరీ ట్రైనీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అధికారులు 30 మంది నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్, ఢిల్లీకి చెందిన ట్రైనీ అధికారులు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ముందుగా వారికి మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. బల్దియాలో జరిగే శానిటేషన్ పనులు, మినీ ట్యాంక్‌బండ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వ్యవస్థ, ఫిల్టర్ బెడ్, డంపింగ్ యార్డు, బయో మైనింగ్ ప్రాసెస్, వైకుంఠ ధామాలు, అర్బన్ పార్కులను ట్రైనీ అధికారులు పరిశీలిస్తారు. శుక్రవారం నగరంలో జరిగే మెప్మా కార్యకలాపాలు, డ్వాక్రా గ్రూపుల నిర్వహణ, స్త్రీనిధి, మహిళా సంఘాల ఏర్పాటు, రుణాల పంపిణీ పరిశీలిస్తారు. తర్వాత పలు ప్రభుత్వ పాఠశాలలు, అర్బన్ హెల్త్ సెంటర్‌ల నిర్వహణను పరిశీలిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ వ్యక్తులు బోధిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా విద్యాబోధన చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ స్పష్టం చేశారు. బుధవారం 'సాక్షి'లో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ వ్యక్తులు బోధన చేస్తున్నారని కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఈవో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తులు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడి ఉన్నత పాఠశాలకు సంబంధించి మధ్యాహ్న భోజనం, టీచర్ల వివరాలపై స్థానిక ఎంఈవో విచారణ చేపట్టారు.

చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తాం



నిజామాబాద్ సిటీ : సారంగపూర్‌లోని సహకార చక్కెర కర్మాగారాన్ని త్వరలోనే తెరిపించి రైతులకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెరుకు రైతు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చక్కెర ఫ్యాక్టరీ గతంలో ఓ వెలుగు వెలిగిందన్నారు. రైతు సదస్సులో నాయకులు ఆకుల పాపయ్య, పోచారం సంతోష్, లక్ష్మారెడ్డి, వేల్పూర్ భూమయ్య, కొట్టే గంగాధర్,పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బయటపడుతున్న పచ్చిక బయళ్లు



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎత్తిపోతల ద్వారా పంటలకు నీరందిస్తున్న నేపథ్యంలో డొంకేశ్వర్ మండలం చిన్నయానం, జీజీ నడ్కుడ, గాదేపల్లి, నికాల్‌పూర్ ప్రాంతాల్లో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ క్రమేపి తగ్గుతోంది. దీంతో పచ్చిక బయళ్లు బయట పడుతున్నాయి. మత్స్యకారులకు చేపలు పట్టేందుకు సులభంగా మారింది. తెప్పలను లోపలి తీసుకెళ్తున్నారు. అదే విధంగా పచ్చిక బయళ్లు తేలుతుండడంతో పక్షుల సందడి కొద్దికొద్దిగా మొదలవుతోంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ తిలక్‌గార్డెన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ ఆర్ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లమ్మగుట్ట, ద్వారకా నగర్, హైదరాబాద్ రోడ్‌లోని ఎల్లమ్మగుట్ట నుంచి నిఖిల్ సాయి హోటల్ వరకు, కోర్టు, పోలీస్ గ్రౌండ్, కమిషనర్ ఆఫీసర్, ఖలీల్‌వాడి, ఆర్‌పీ రోడ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కళాశాల, హాతీగల్లీ, ఆజామ్‌రోడ్, కసాబ్ గల్లీ, ఉప్పర్ టేకిడి, పోచమ్మగల్లీ, పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.



1964లో కళాశాలకు భూమిపూజ చేస్తున్న అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ పట్టోం థాను పిళ్లై



1967లో కళాశాలను సందర్శించిన పీవీ నరసింహారావు



1970లో సందర్శించిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్



1965లో సందర్శించిన స్వామి రామానంద తీర్థ



1987లో సందర్శించిన అప్పటి ఏపీ స్పీకర్ జి నారాయణరావు



1974లో సందర్శించిన అటల్ బిహారీ వాజ్‌పేయి



2018లో కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో ఫౌండర్ ఎం నారాయణరెడ్డి

మహిళా సాధికారతకు ప్రతీక !

- లాభాపేక్ష లేకుండా 60 ఏళ్లుగా విద్యాసేవలు
- ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ స్ఫూర్తి
- పేద విద్యార్థినులకు సహకరిస్తున్న పూర్వ విద్యార్థినులు
- ఇందూరు మహిళా కళాశాల ప్రస్థానం
- నేడు, రేపు కళాశాలలో ఇన్‌స్పైర్ ఇండియా స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో



ఉమెన్స్ కళాశాల



50 ఏళ్ల ఉత్సవాల సమయంలో కట్టిన స్తూపం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బాలికలకు ఉన్నత విద్య అందించి మహిళా సాధికారత సాధించేందుకు 60 ఏళ్ల క్రితమే ఇందూరులో బలమైన అడుగులు పడ్డాయి. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కళాశాల తరువాత నిజామాబాద్‌లో గ్రామీణ పేద బాలికలకు ఉన్నత విద్యనందించేందుకు గాను మహోన్నత ఆశయంతో ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటైంది. 1963లో పురుడు పోసుకున్న ఈ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉమెన్స్ కళాశాల ద్వారా ఇప్పటివరకు సుమారు 30 వేల మంది మహిళా పట్టభద్రులు బయటకు వచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా నడుస్తున్న ఈ సొసైటీ అప్పటి ఎమ్మెల్సీ ఎం గంగారెడ్డి, అప్పటి ఎంపీ ఎం నారాయణరెడ్డి ఆలోచనతో మొదలైంది. ఈ ఆలోచన గురించి అప్పటి జెడ్పీ చైర్మన్ కేఆర్ రాజిరెడ్డి, కలెక్టర్ బీఎన్ రామన్‌లతో ప్రస్తావించారు. రాజిరెడ్డి, రామన్‌ల సహకారంతో కంఠేశ్వర్ ప్రాంతంలో 1964లో 21 ఎకరాలు సొసైటీ ద్వారా కొనుగోలు చేశారు. ఆ సమయంలో ఈ సొసైటీకి అధ్యక్షుడిగా అప్పటి కలెక్టర్ రామన్, ఉపాధ్యక్షుడిగా కేఆర్ రాజిరెడ్డి, కార్యదర్శిగా ఎం నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం గంగారెడ్డి, కోశాధికారిగా బి కిషన్‌లాల్, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా వీకే రెడ్డి, ఆలూరు మల్లారెడ్డి, శ్రీరాంపూర్ చిన్నారెడ్డి, రంగులాల్ గోవర్ధన్, హొన్నాజిపేట గంగాగౌడ్ వ్యవహరించారు. వీళ్లందరి కృషితో నిధులు సమీకరించారు.

1965లో కళాశాల ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థినుల కోసం వసతి గృహం నిర్వహిస్తున్నారు. పూర్తి సేవాభావంతో నిర్విరామంగా నడుస్తున్న ఈ కళాశాలలో తల్లిదండ్రులు లేని పేద పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్నారు. మరికొందరికి ఫీజులో రాయితీలు ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ కళాశాలలో వెయ్యి మంది విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ఈ కళాశాలను అటల్ బిహారీ వాజ్‌పేయి, పీవీ నరసింహారావు, స్వామి రామానంద తీర్థ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ లాంటి మహామహులు సందర్శించడం విశేషం.

■ ఈ కళాశాల ద్వారా కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలు వితరణ చేశారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు వితరణ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సొసైటీ అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా నళినిరావు, కార్యదర్శిగా కృపాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కిషన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, కోశాధికారిగా అబ్బన్న, సభ్యులుగా మహేందర్‌రెడ్డి, శశికిరణ్‌రెడ్డి, సాయిబాబాగౌడ్, అమృత లత వ్యవహరిస్తున్నారు.

■ 1965–80 మధ్య ఈ కళాశాలలో చదివినవారిలో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికైన వారున్నారు. చాలామంది విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో పలువురు ప్రస్తుతం చదువుతున్న పేద విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్పులు ఇచ్చేందుకు సహకరిస్తున్నారు. పూర్వ విద్యార్థుల ద్వారా జమ చేసిన నిధి నుంచి వచ్చే వడ్డీతో మెరిట్ అవార్డులు ఇస్తున్నారు. ఇక్కడ చదివిన ఆకుల లలిత ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఐఏఎస్‌లుగా ఉన్నత సర్వీసులు సాధించినవారిలో దాకా స్వర్ణ, కరుణశ్రీ తదితరులు ఉన్నారు.



భారతీరెడ్డి, ప్రిన్సిపల్

■ ప్రస్తుతం 16వ ప్రిన్సిపల్‌గా కే భారతీరెడ్డి వ్యవహరిస్తున్నారు. మూడున్నరేళ్లుగా ప్రిన్సిపల్‌గా ఉన్న ఈమె ఇక్కడ గత 36 సంవత్సరాలుగా బోధన సేవలందిస్తున్నారు. సమున్నత ఆశయంతో నడుస్తున్న ఈ కళాశాలలో పనిచేస్తుండడం పట్ల గర్వంగా ఉందని భారతీరెడ్డి తెలిపారు.

ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు..

ఇంటర్, డిగ్రీ కోర్సులున్న ఈ ఉమెన్స్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు సైతం నడుస్తున్నాయి. గత ఏడాది ఢిల్లీలో రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఈ కళాశాల ఎన్‌సీసీ బృందం పాల్గొంది. ఇక షూటింగ్ పోటీలకు ఈ కళాశాలకు చెందిన విద్యార్థినులు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్, రాజస్తాన్ వెళ్లారు. కళాశాల మైదానంలో ఫుట్‌బాల్ శిక్షణ పొందుతున్న బాలికలు, 14 ఏళ్లలోపు బాలురకు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఆర్చరీ శిక్షణ కోసం ఉచితంగా అవకాశం కల్పించారు.



కళాశాల భవనం

యూత్ ఎక్సెలెన్స్ ఆధ్వర్యంలో..

గురు, శుక్రవారాల్లో కళాశాలలో కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థుల కోసం స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో ఇస్రో, డీఆర్‌డీవో ప్రయోగ పరికరాలను ప్రదర్శించనున్నారు.

పసిడి పరుగులు

పది గ్రాములకు రూ. 87,000



నిజామాబాద్ రూరల్: పసిడికి ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. బుధవారం పది గ్రాముల బంగారం (24 క్యారెట్) ధర రూ. 87 వేలు పలికింది. మంగళవారం రూ. 84,300 ఉండగా ఒక్కరోజులో రూ. 2,700 పెరిగింది. పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం ధర పెరగడంతో ముహూర్తాలు పెట్టుకున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. గత వారంపదిరోజులుగా బంగారం ధర రూ.82 వేల నుంచి రూ.83 వేల మధ్యనే ఉందని బంగారు వర్తకులు తెలిపారు. కిలో వెండి ధర రూ.95,500 లకు చేరుకుంది.

ట్రంప్ నిర్ణయాలవల్లే పెరిగిన ధర



అమెరికాలో ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం బంగారానికి రెక్కలు వచ్చాయి. సామాన్యులకు అందకుండా బంగారం ధరలు పెరుగుతుంటే కొనుగోలు చేయడానికి సుముఖత చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని బంగారం ధరలపై దృష్టి సారించాలి.

– గణేష్, జువెల్లర్స్ షాపు యజమాని, నగరవాసి

రానున్న రోజుల్లో రూ. లక్ష పలుకుతుంది



ఇంటర్ నేషనల్ మార్కెట్‌లో బంగారం ధర హెచ్చు తగ్గులు ఉండడం వల్లే బంగారం రేటు పెరుగుతోంది. రానున్న రోజుల్లో బంగారం రూ. లక్షకు చేరువవుతుందని అనిపిస్తోంది. ఇలా ఉంటే సామాన్యుడికి చాలా ఇబ్బంది ఏర్పడుతుంది.

– భూషణ్ చారి, బంగారం వర్తకుడు, నగరవాసి

పంచాయతీల్లో పన్ను వసూళ్లు 50 శాతమే !

- రూ.29.5 కోట్లకుగాను రూ.13.10 కోట్లు వసూలు
- సర్వేలకే సరిపోతున్న పంచాయతీ కార్యదర్శులు
- 63.51 శాతంతో మాక్లూర్ ముందంజ.. 22.45 శాతంతో చివరి స్థానంలో ఎడపల్లి పంచాయతీ



సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్నుల వసూళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 55 రోజుల గడువు మాత్రమే ఉంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 శాతం కూడా పన్నులు వసూళ్లు కాలేదు. రూ.13.10 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో ఆరు నెలలుగా కులగణన, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ఇతర అన్నిరకాల పనులు చేయిస్తుండటంతో సతమతమవుతున్నారు.జిల్లా వ్యాప్తంగా 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. డిమాండ్ రూ.29.58 కోట్లు ఉండగా, రూ.13.10 కోట్లు వసూలైంది. అంటే 44.30 శాతమే పూర్తయ్యింది. మార్చి 31 వరకు వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కార్యదర్శులకు అధికారులు నిర్దేశించారు. గతేడాది 97 శాతానికిపైగా వసూలు కాగా, ఈసారి ఇంటి పన్నుల వసూలు మందగించింది.

పని ఒత్తిడికి లోనవుతున్నారు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తోంది. పథకాల అమలు పకడ్బందీగా చేపట్టి అర్హులకు వర్తింపజేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఉండే పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో సర్వేలు చేయిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు జాబ్‌చార్ట్‌తో పాటు సర్వేలు, ఇతరత్ర పనులు చేస్తుండటంతో వారంతా పని ఒత్తిడికి లోనవుతున్నారు. ఇటీవల ఉద్యోగ ఫలితాలు రావడంతో కొందరు పంచాయతీ కార్యదర్శులు రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. దీంతో ఉన్న వారిపై పనిభారం పెరిగింది. మండలానికి రెండు, మూడు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉండగా, ఓపీఎస్‌లను నియమించుకున్నారు. జిల్లాకు నిర్దేశించిన ఇంటి పన్నుల వసూలు లక్ష్యం చేరుకోవాలంటే మరో 55 రోజులు మాత్రమే మిగిలి ఉంది. మాక్లూర్ మండలం 63.51 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, ఎడపల్లి మండలం 22.45 శాతంతో చివరిస్థానంలో ఉంది.

వందశాతం పూర్తి చేస్తాం..



జిల్లాకు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఇంటి పన్నుల వసూలు మార్చి 31లోగా పూర్తి చేస్తాం. ప్రభుత్వ పథకాల అమలు కోసం సర్వే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు. పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తాం. ఎట్టి పరిస్థితుల్లో వందశాతం పూర్తి చేయడమే అందరి ముందున్న లక్ష్యం. – శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

పెన్షన్ డబ్బులు ముట్టడం లేదు!

- బ్యాంక్ ఖాతాల్లోనే మగ్గిపోతున్న సొమ్ము
- 650 మంది లబ్ధిదారులను గుర్తించిన అధికారులు



నిజామాబాద్ సిటీ : నిస్సహాయులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు గాను ప్రభుత్వం ఆసరా పెన్షన్‌లు ఇస్తోంది. ఒంటరి, వితంతు, వికలాంగ, వృద్ధాప్య, బీడీకార్మికులు, హెచ్‌ఐవీ బాధితులు, చేనేత, గీత కార్మికులైన లబ్ధిదారులకు ప్రతి నెలా పెన్షన్ సొమ్మును పింపిణీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీసు ద్వారా ఇవ్వగా, కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2లక్షల 7వేల 716 ఆసరా పెన్షన్‌లు ఉన్నాయి. నిజామాబాద్ కార్పొరేషన్‌లో 38 వేల 671 ఆసరా పెన్షన్‌లు ఉన్నాయి. అయితే జిల్లాలో దాదాపు 650 మంది లబ్ధిదారులు ఆసరా పెన్షన్ డబ్బులు తీసుకోవడం లేదు. ప్రభుత్వం ప్రతినెలా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్న పెన్షన్ సొమ్మును ఏళ్లుగా లబ్ధిదారులు డ్రా చేయడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు వారి ఖాతాల్లోనే మగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్ మున్సిపాలిటీ, ఆర్మూర్ మున్సిపాలిటీ, భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొని ఉంది. డబ్బులు డ్రా చేయని వారి ఖాతాలు నాన్ ట్రాన్సాక్షన్ ఖాతాలుగా మారనున్నట్లు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి లబ్ధిదారుల నుంచి అధికారులు ప్రతియేడాది జీవన ప్రమాణపత్రం (లైవ్ సర్టిఫికెట్) తీసుకోవాలి. మరణించినవారి పేర్లు పెన్షన్ జాబితా నుంచి తొలగించాలి. అయితే ఇలా జరగడం లేదని తెలుస్తోంది. దీంతో

బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేయని వారు జీవించి ఉన్నట్లేనా అని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేదా డబ్బులు అవసరం లేక బ్యాంకు ఖతాల్లో నుంచి డ్రా చేయడం లేదా ? అన్నది స్పష్టత రావడం లేదు.

లైవ్ సర్టిఫికెట్ సమర్పించాలి

డబ్బులు డ్రా కాని పెన్షన్ దారుల ఖాతాలను గమనించిన బ్యాంకు అధికారులు మాకు సమాచారం ఇచ్చారు. ఇందులో అన్ని రకాల పెన్షన్ దారులు ఉన్నారు. ప్రతి పెన్షన్‌దారు సంవత్సరానికి ఒకసారి లైవ్ సర్టిఫికెట్ సమర్పించాలి. మృతి చెందిన వారి వివరాలు మున్సిపల్ అధికారులకు తెలపాలి.

– రాచయ్య, డీపీఎం, డీఆర్‌డీఏ



విగ్రహాలకు చక్రస్నానం చేయిస్తున్న పూజారులు

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థం



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ నగరంలోని శ్రీ నీలకంఠేశ్వరాలయంలో బుధవారం భక్తి శ్రద్ధలతో చక్ర తీర్థం నిర్వహించారు. ఉదయం శివపార్వతుల విగ్రహాలను ఆలయ కోనేరు వరకు ఊరేగింపు తీశారు. కోనేరులో విగ్రహాలకు చక్ర స్నానం చేయించారు. అనంతరం ఆలయ మహా మండపంలో స్వామివారికి పుష్ప యాగం, సప్తవర్ణాల సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుహాస్, కార్య నిర్వహణాధికారి శ్రీరామ్ రవీందర్, ఆలయ అర్చకులు నీలేష్ కులకర్ణి, శేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి చెందిన వలంటీర్ తరుణ్, తెలంగాణ కాంటింజెంట్ లీడర్ డాక్టర్ ఎం సునీతను వీసీ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి బుధవారం అభినందించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ అత్యున్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ఆఫీసర్ డాక్టర్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది జీవనోపాధి ద్వారా పొందుతున్న ఆదాయ వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని సెర్ప్ డైరెక్టర్ ప్రశాంతి అన్నారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఐకేపీ సిబ్బందితో వర్క్‌షాప్ నిర్వహించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలి కుటుంబ ఆదాయ వివరాలను 'ఆజీవికా' రిజిస్టర్‌లో ఎంట్రీ చేసే విధానాన్ని వివరించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్, అధికారులు రవీందర్, మురళి, రెండు జిల్లాల డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అరుదైన ఆఫ్రికన్ అతిథి



ఆఫ్రికా దేశానికి చెందిన బూడిద రంగు కొంగ ఒకటి మండలంలోని ఘన్‌పూర్లో ప్రత్యక్షమైంది.గ్రామానికి చెందిన మాజీ పీఎస్‌ఎస్ చైర్మన్ ఏనుగు దయాకర్‌రావు ఇంటి సమీపంలో బుధవారం తచ్చాడుతున్న కొంగను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

–మాచారెడ్డి

బాలలతో పని చేయిస్తే కేసులే..

- జిల్లాలో ఇద్దరిపై కేసులు నమోదు
- 600 మంది బాలల గుర్తింపు
- సీడబ్ల్యూసీ ఎదుట తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, బాలల అప్పగింత
- దర్పన్ యాప్‌లో వివరాలు నమోదు



ఖలీల్‌వాడి: ఆర్మూర్ డివిజన్‌లోని నందిపేట్‌లో ఆపరేషన్ స్మైల్ బృందం తనిఖీలు చేయగా ఓ బాలుడు (15) పని చేస్తూ కనిపించాడు. వివరాలు తెలుసుకొని బాలుడితో కఠినమైన పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేయించారు.

నిజామాబాద్ నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీల్లో భాగంగా స్మైల్ బృందం సభ్యులు బాలుడి చేత పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేయించారు.

ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని 2015 నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతి ఏడాది జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పోలీసుశాఖ, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. జనవరిలో జిల్లాలో మూడు బృందాలు 60 మంది పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారితో పని చేయించిన యజమానులపై కేసులు నమోదు చేశారు.

ఆపరేషన్ స్మైల్‌లో సభ్యులు వీరే..

నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లో మూడు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తారు. ఇందులో ఓ ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉండగా ఒక మహిళ, ఇద్దరు పురుషులు ఉంటారు. మూడు బృందాల్లో ముగ్గురు ఎస్సైలు, 9 మంది కానిస్టేబుళ్లు ఉంటారు. వీరితోపాటు కార్మికశాఖ అధికారి, బాలల పరిరక్షణ సమితి ఉద్యోగి, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి ఆపరేషన్ స్మైల్ బృందంలో ఉంటారు.

ఆపరేషన్ స్మైల్ ఉద్దేశం ఇదే..

లైంగిక దాడుల నుంచి విముక్తి, మానవ అక్రమ రవాణా నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, మత్తుకు బానిసయ్యే వారిని సమాజంలో కలిపి బాధ్యతాయుతంగా మెదిలేలా చేయడంతోపాటు వారికి నాణ్యమైన విద్యనందించడం కోసం ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 18 ఏళ్ల వరకు ఉచిత విద్య, సంరక్షణ కల్పించేందుకు ఆపరేషన్ స్మైల్ ఎంతగానో తోడ్పడుతుంది. తల్లిదండ్రులకు అప్పగించిన తర్వాత బాలలు చదువుకుంటున్నారా? ఎలాంటి పనులు చేస్తున్నారు? అనే దానిపై ఆరా తీస్తారు.

బాలలకు వెలుగులు..

భిక్షాటన చేసే పిల్లలను గుర్తించడంతోపాటు తప్పిపోయినవారిని అనాథ పిల్లలను శిశు రక్షణ కేంద్రాల్లో ఉంచుతారు. వివిధ చోట్ల పని చేసే బాలలను గుర్తించి వారిని సీడబ్ల్యూసీ ఎదుట ఉంచి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగిస్తారు. బాలల వివరాలను దర్పన్ యాప్‌లో నమోదు చేస్తారు. తల్లిదండ్రుల సహకారంతో బాలలను చదివించడానికి బాలల సంక్షేమ సమితి సహకారంతో పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రతియేటా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని చేపట్టి బాలల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

జనవరిలో డివిజన్‌ల వారీగా గుర్తించిన బాలల వివరాలు

నిజామాబాద్	ఆర్మూర్	బోధన్	మొత్తం
20	17	23	60

కేసులు నమోదు చేస్తాం

18 ఏళ్ల లోపు బాలలతో పని చేయించే యజమానులపై కేసులు నమోదు చేసి రూ.25 వేల జరిమానా విధిస్తాం. బాలలతో పనిచేయించే వారి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1098కి అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– స్రవంతి, ఎస్సై, షీ టీం, నిజామాబాద్

50వేలకు పైగా కోళ్ల మృత్యువాత!



భీమ్‌గల్‌లో పౌల్ట్రీని పరిశీలిస్తున్న వెటర్నరీ అధికారులు

- బాయిలర్ కోళ్లకు అంతుచిక్కని వ్యాధి
- జిల్లాలో 11 ఫారాల్లో విస్తరించిన వైరస్
- శాంపిళ్లు సేకరించిన పశుసంవర్ధక శాఖ



వైరస్ కారణంగా భీమ్‌గల్ మండలంలోని ఓ పౌల్ట్రీలో మృతి చెందిన కోళ్లు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో బాయిలర్ కోళ్లకు అంతు చిక్కని వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. ఫారాల్లో పెరుగుతున్న కోళ్ల భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే భీమ్‌గల్, వేల్పూర్, నవీపేట్, పాతంగల్, కమ్మర్‌పల్లి ప్రాంతాల్లోని 11 ఫారాల్లో వైరస్ విస్తరించగా 50వేల కోళ్లకు పైగా మృత్యువాత పడ్డాయి. వాటిని తీసుకెళ్లి గుంతలను తవ్వి అందులో పూడ్చి పెడుతున్నారు. దీంతో కోళ్ల ఫారాల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడి మొత్తం కోల్పోయామని ఆందోళన చెందుతున్నారు. ఒకదాని నుంచి మరొక దానికి వైరస్ వేగంగా వ్యాపిస్తుండడంతో కోళ్ల మరణాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాల నిర్వాహకులను కూడా అప్రమత్తం చేసింది. పశువైద్య అధికారులు పౌల్ట్రీల వద్దకు వెళ్లి చనిపోయిన కోళ్ల నుంచి శాంపిళ్లను సేకరిస్తున్నారు. కోళ్ల మృతికి కొక్కెర వ్యాధి కారణం కావొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నప్పటికీ నిర్ధారణ కోసం శాంపిళ్లను హైదరాబాద్‌లోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ యూనిట్‌కు పంపించారు. నాలుగు రోజుల్లో రిపోర్టు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో బాయిలర్ కోళ్లను పెంచుతున్న ఫారాలు మొత్తం వందకుపైగా ఉండగా, లేయర్ ఫారాలు 20వరకు ఉన్నాయి. కోళ్లను పెంచే ఫారాల్లోనే వైరస్ ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఫారాలు దగ్గర దగ్గరగా ఉంటే తొందరగా కోళ్లకు వైరస్ వస్తోంది.

వైరస్ సోకిన ఒకటి, రెండు రోజుల్లో చనిపోతున్నాయని, మందులు వాడినా ప్రయోజనం ఉండడం లేదని పౌల్ట్రీ నిర్వాహకులు చెబున్నారు. అయితే వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కోళ్ల ఫారాల్లో జీవ సంరక్షణ చర్యలు చేపట్టాలని, తరచుగా శానిటేషన్ చేయాలని పౌల్ట్రీ నిర్వాహకులకు సూచనలు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి 'సాక్షి'కి తెలిపారు.

భూములు కోల్పోయేవారికి నష్టపరిహారం చెల్లిస్తాం

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌– బోధన్ రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందిస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం మహమ్మద్‌నగర్ తహసీల్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో 38 ఎకరాల భూముల్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. విస్తరణ పనులకు రైతులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ సవాయిసింగ్, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

'పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో మంజూరు చేయాలి'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీఎన్‌జీవోస్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ నేతలు మాట్లాడుతూ.. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందజేసి ఉద్యోగులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల పాలిట పెనుశాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, కోశాధికారి ఎం.దేవరాజు, ఉపాధ్యక్షులు యు.సాయిలు, శ్రావణ్, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, రాజేశ్వర్, పోచయ్య, అర్బన్ అధ్యక్షుడు కే.శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర మాస్టిన్ కమిటీ ఎన్నిక



బీబీపేట: తెలంగాణ రాష్ట్ర మాస్టిన్ కమిటీ సభ్యులను హైదరాబాద్‌లో బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన వారికి పదవులు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుద్దుల సాయిలు, రాష్ట్ర కార్యదర్శిగా బుద్దుల రాజనర్సు, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్, రాష్ట్ర కోశాధికారిగా శంకర్, ముఖ్య నాయకులుగా దశరథం, యాదగిరి, ప్రచార కమిటీ సభ్యుడిగా రామదాసులను ఎన్నుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఖలీల్‌వాడి: ఆర్థిక పరిస్థితులు సరిగా లేని అమాయక మహిళలను, ప్రేమ పేరుతో యువతులను వ్యభిచార కూపంలోకి లాగే వారితో అప్రమత్తంగా ఉండాలని సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి అన్నారు. నగరంలోని మహాలక్ష్మి కాలనీలో ఉన్న సీసీఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలను భయపెట్టే, ఇబ్బందులకు గురిచేసే వారి సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతివ్వండి.. అండగా నిలబడతాం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

సుభాష్‌నగర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి మద్దతుగా నిలవాలని, గెలుపొందిన తర్వాత నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్–మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, బీజేపీపై అభిమానం పెరుగుతోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుంటే భవిష్యత్‌లో అసెంబ్లీపై కాషాయ జెండా ఎగురవేయడానికి పునాది అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. ప్రభుత్వం బీసీల్లో ఉన్న ముస్లిములను లెక్కించినప్పుడు.. ఎస్సీల్లో ఉన్న క్రైస్తవులను కూడా లెక్కించాలని డిమాండ్‌చేశారు. జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, టక్కర్ హన్మంత్‌రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, బద్దం లింగారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, స్రవంతిరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ప్రయోగ పరీక్షల నిర్వహణ తీరును జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాకతీయ, ఎస్ఆర్, వెక్టార్, సత్య కళాశాలలను డీఐఈవో తనిఖీ చేయగా, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 15 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో జియో ట్యాగింగ్ చేయాలని, కెమెరాలు పని చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కెమెరాల ద్వారా హైదరాబాద్ నుంచి కమిషనర్ పర్యవేక్షిస్తున్నారన్నారు. తనిఖీల్లో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఏటీఎంలో మంగళవారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. ఏటీఎం ముందున్న సీసీ కెమెరాలపై నల్లటి రంగు పూసి లోనికి వెళ్తుండగా పోలీసులు ఎస్కార్ట్ బైక్‌పై అటువైపు రావడంతో దుండగులు తాము వచ్చిన కారులో పరారయ్యారు. ఎస్కార్ట్ బైక్‌పై పోలీసులు ఇద్దరు మాత్రమే ఉండడంతో దుండగుల వాహనాన్ని వెంబడించలేదు.

క్రైం కార్నర్

మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి



గంగాధర్ మృతదేహం

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గండిలో రెంజల్ మండలానికి చెందిన గంగాధర్(65) అనే వృద్ధుడు మృతి చెందినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై–2 ఆనంద్‌సాగర్ బుధవారం తెలిపారు. రెంజల్ మండల కేంద్రానికి చెందిన గంగాధర్ గత 20 సంవత్సరాలుగా మతిస్థిమితం లేక ఇంటిలో నుంచి బయటికి వస్తూ తిరుగుతుండేవాడని, ఈ క్రమంలో రెంజల్ నుంచి మల్లారం గండి వరకు వచ్చాడన్నారు. గత నాలుగైదు రోజులుగా ఆహారం లేక మల్లారం గండిలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టామన్నారు. మృతుడిని రెంజల్‌కు చెందిన గంగాధర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉన్నారని ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు..



హరిసింగ్ (ఫైల్)

సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ శివారులో బైక్ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై ఎల్ రామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెట్టుమర్రి తండాకు చెందిన బట్టు హరిసింగ్(55) బుధవారం మధ్యాహ్నం తన బైక్‌పై సిరికొండకు వెళ్తుండగా, హుస్సేన్‌నగర్ శివారులో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. పక్కనే ఉన్న పొలంలో పడి తీవ్ర గాయాలపాలైన హరిసింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు శిక్ష

వేల్పూర్/కమ్మర్‌పల్లి/రుద్రూర్/బోధన్ టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్, బోధన్ న్యాయస్థానాలు తీర్పు వెలువరించాయి. వేల్పూర్ మండలం రామన్నపేట్‌కు చెందిన వ్యక్తికి, కమ్మర్‌పల్లికి చెందిన మరో వ్యక్తికి ఆర్మూర్ కోర్టు మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సైలు సంజీవ్, అనిల్‌రెడ్డి తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ కామారెడ్డికి చెందిన ఒకరు, మహారాష్ట్రకు చెందిన మరొకరు పట్టుబడ్డారని కోటగిరి ఎస్సై సందీప్, బోధన్ పట్టణంలోని బీటీ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి, హున్సాకు చెందిన మరో వ్యక్తి పట్టుబడ్డారని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టుబడిన వారిని బోధన్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని సీఐ, ఎస్సైలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పిట్లం(జుక్కల్): అనుమతులు లేకుండా బిచ్కుంద మండలం వాజీద్‌నగర్ శివారులోని మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఆరేడ్‌లో ఓ ట్రాక్టర్..

నిజాంసాగర్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని ఆరేడ్‌లో బుధవారం సీజ్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కొంకుల నర్సింలు అనుమతి లేకుండా తన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండటంతో కేసు నమోదు చేశామన్నారు.

వాహనాలు సీజ్



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన పలు వాహనాలను పట్టణ పోలీసులు బుధవారం సీజ్ చేసి ఠాణాకు తరలించారు. ద్విచక్ర వాహనాలను లిఫ్ట్ సహాయంతో డీసీఎంలోకి ఎక్కించి తరలించారు. పార్కింగ్ స్థలం తక్కువగా ఉందని, అలాంటప్పుడు వాహనాలు ఎక్కడ నిలపాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో దేగాం గ్రామానికి చెందిన గూండ పెద్ద గంగారాం అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గంగారాం తన ద్విచక్ర వాహనంపై బుధవారం అర్గుల్ నుంచి తొర్లికొండకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. గంగారాంను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కితే ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

ఖలీల్‌వాడి: సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కితే బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా www. cybercrime. gov. inలో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. నగర శివారులోని మానిక్‌బండార్‌లో ఉన్న కిట్స్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైంపై బుధవారం ఏసీపీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎంలలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు వస్తే వెంటనే స్పందించొద్దని అన్నారు. ఇటీవల కాలంలో జంప్ డిపాజిట్ స్కామ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని, యూపీఐలో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు పంపించి మెసేజ్‌లు, ఫోన్‌లు చేస్తారని, వెంటనే బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే ఖాతాలో ఉన్న నగదును సైబర్ మోసగాళ్లు కాజేస్తారని అన్నారు. అలాగే మల్టీలెవల్ మార్కెటింగ్, పిరమిడ్ స్కామ్స్ ఎక్కువగా జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో చోరీ

ఎల్లారెడ్డి : పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముండే జునైద్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. జునైద్ అంగడికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు బీరువాలోని 3 తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చుక్కాపూర్‌లో బైక్..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నుంచి ఈ నెల 2న కామారెడ్డికి చెందిన శంకర్‌రావు బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఆలయంలోకి వెళ్లి వచ్చేసరికి బైక్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

బైకును ఢీకొట్టిన కంటైనర్

ఎల్లారెడ్డిరూరల్: పట్టణ శివారులోని పెద్ద చెరువు కట్ట వద్ద బైక్‌ను కంటైనర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లికి చెందిన రాజు ఎల్లారెడ్డి నుంచి తన గ్రామానికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజు చెరువు కట్ట పైనుంచి కింద పడగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లోఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.